

శాలిపేట హైస్కూల్‌కు ఇద్దరు టీచర్లు

చిన్నశంకరంపేట, జూన్ 29: చిన్నశంకరంపేట మండలంలోని శాలిపేట గ్రామ హైస్కూల్లో ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు ఆందోళన చేసిన సంగతి తెలిసినదే. విద్యా శాఖాధికారులు స్పందించి శనివారం డిప్యూటేషన్‌పై ఇద్దరు సబ్జెక్టు టీచర్లను నియమించారు. మరి కొంతమంది ఉపాధ్యాయులను నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఈవో బుచ్చయ్య నాయక్ తెలిపారు. విద్యార్థులకు విద్యా బోధనలో ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూసుకుంటామన్నారు. దీంతో విద్యార్థులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

ఎస్జీటీల బదిలీలకు రంగం సిద్ధం


సంగారెడ్డిలోని డీఈవో కార్యాలయం

- ముగిసిన అభ్యంతరాల స్వీకరణ
- నేటి నుంచి వెబ్‌ఆప్షన్ల నమోదు
- బదిలీ ఉత్తర్వులు ఎల్లుండి వెలువడే అవకాశం

సంగారెడ్డి అర్బన్, జూన్ 29 : సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీలకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే ఎస్జీటీల బదిలీలకు సంబంధించి సీనియారిటీ జాబితాను అధికారులు విడుదల చేసి, అభ్యంతరాలు స్వీకరించారు. నేడు వెబ్‌ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభం కానున్నది. జూలై 1 లేదా 2న ఎస్జీటీల బదిలీ ఉత్తర్వులు వెలువడనున్నాయి. ఉత్తర్వులు అందుకున్న ఎస్జీటీలు వెంటనే కొత్త పాఠశాలల్లో చేరాల్సి ఉంటుంది. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులతో జిల్లాలో భారీగా ఖాళీలు ఏర్పనున్నాయి. జిల్లాలో చేపట్టిన ప్రక్రియలో 88 మంది జీహెచ్ఎంలుగా పదోన్నతి పొందగా, 92 మంది జీహెచ్ఎంలు బదిలీ అయ్యారు. ఆ తర్వాత 777 మంది స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి దక్కగా, 834 మంది స్కూల్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు. తాజాగా జరగనున్న ఎస్జీటీల బదిలీలతో సుమారు 1,500 మందికి స్థానచలనం కలిగే అవకాశం ఉందని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. ఉపాధ్యాయ ఖాళీలతో ఉన్నత, ప్రాథమిక పాఠశాలల బోధనపై తీవ్ర ప్రభావం పడే అవకాశముంది. ఆ స్థానాల్లో విద్యావలంటీర్లను నియమిస్తారా లేక, ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తారా అనేది వచ్చేనెల మొదటి వారంలో స్పష్టత వస్తుందని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

వలస కూలీ కుటుంబంలో విషాదం

పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లోని ఓ వెంచర్‌లో బిహార్‌కు చెందిన ఓ కుటుంబం కూలి పని చేసుకుంటూ గుడిసెలో జీవిస్తున్నది. ఆ కుటుంబంలోని ఎనిమిదేళ్ల బాలుడు విశాల్ కాలకృత్యాలు తీర్చుకోవడానికి శుక్రవారం ఉదయం గుడిసె నుంచి కొద్ది దూరం వెళ్లాడు. అదే సమయంలో గుంపుగా వచ్చిన వీధి కుక్కలు బాలుడిపై ఒక్కసారిగా దాడిచేశాయి. పీక్కు తినడానికి ప్రయత్నించాయి. కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. కొద్దిసేపటి తరువాత అటుగా వచ్చినవారు గమనించి కుక్కలను వెళ్లగొట్టారు.

నెలల చిన్నారిపై వీధి కుక్కల దాడి



పటాన్‌చెరు మండలంలోనే ముత్తంగి గ్రామంలో మరో వలస కూలీ కుటుంబంలో ఏడు నెలల చిన్నారిని కుక్కలు లాక్కువెళ్లేందుకు ప్రయత్నించాయి. ముత్తంగిలో ఓ భవనం వద్ద నిర్మాణ పనులు చేసుకుంటున్న తల్లిదండ్రులు అక్కడే వారుండే గుడిసె ఎదుట చిన్నారిని పడుకోబెట్టి పక్కనే పని చేసుకుంటున్నారు. ఇంతలోనే అటుగా వచ్చిన కుక్కల గుంపు చిన్నారిపై దాడి చేసి లాక్కువెళ్లేందుకు ప్రయత్నించాయి. చిన్నారి ఏడుపు విని తల్లిదండ్రులు పరుగున వచ్చి కుక్కలను తరిమికొట్టారు. కానీ అప్పటికే తీవ్రంగా గాయపడిన చిన్నారి అపస్మారక స్థితికి చేరుకుంది. హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు.

కుక్కలు 'భౌ'బోయ్

గత మూడేళ్లలో కుక్కకాటు కేసులు	
సంవత్సరం	కేసులు
2022	3,255
2023	2,520
2024 (జూన్ వరకు)	953


ఓ వీధిలో ఎగబడుతున్న కుక్కలు

- చిన్నారుల పాలిట యమదూతలు
- ఏ వీధిలో చూసినా గుంపులుగా శునకాలు
- మాంసం వ్యర్థాల వల్లే స్వైరవిహారం
- ప్రతి ఏటా వేలల్లో కుక్కకాటు బాధితులు
- నిద్రావస్థలో అధికారులు
- పిల్లల్ని బయటకు పంపేందుకు జంకుతున్న తల్లిదండ్రులు

సంగారెడ్డి క్రైం, జూన్ 29 : వీధి కుక్కలు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. గుంపులుగా తిరుగుతూ వీధుల్లో వెళ్లేవారిపై దాడి చేస్తున్నాయి. చిన్నారులు కనిపిస్తే చాలు పీక్కుతినేందుకు ఎగబడుతున్నాయి. పట్టణాలు.. పల్లెలు అనే తేడా లేకుండా ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి. పిల్లలను బయటికి పంపడానికే తల్లిదండ్రులు బయపడుతున్నారు. జిల్లాలో ప్రతీ సంవత్సరం వేలాది మంది కుక్క కాటు బారినపడుతున్నారు. గత మూడేళ్లలో కుక్క కాటుకు బారినపడినవారి వివరాలు పరిశీలిస్తే ఈ విషయం తెలుస్తుంది. 2022 సంవత్సరంలో 3,255 మంది, 2023లో 2,520 మంది, 2024 (జూన్ వరకు) 953 మంది కుక్కకాటుకు గురయ్యారు. ఈ కేసులు ప్రభుత్వ దవాఖానాల్లో వ్యాక్సిన్ వేయించుకున్నవారివి మాత్రమే.

విచ్చలవిడిగా మాంసం వ్యర్థాలు

పట్టణాలు, పల్లెల్లో గల్లీగల్లీలో వెలసిన చికెన్, మటన్ దుకాణాలే పరోక్షంగా కుక్కలు రెచ్చిపోవడానికి కారణమవుతున్నాయి. మాంసం వ్యర్థాలను ఎక్కడపడితేఅక్కడ పారేస్తున్నారు. మాంసం వ్యర్థాలను తినడానికి అలవాటుపడిన కుక్కలు క్రూరంగా మారుతున్నాయి. చిన్నారులు ఒంటరిగా కనిపిస్తే దాడి చేస్తున్నాయి. అంతేకాకుండా మాంసం వ్యర్థాలను రోడ్లపై చెత్తకుప్పల్లో పడేయడంతో తీవ్రమైన దుర్గంధం వెలువడుతున్నది. దోమలు వ్యాపించి రోగాలకు కారణమవుతున్నాయి. అయినా ఎక్కడా అధికారులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు.

దాడులతో తల్లిదండ్రుల భయాందోళన

వీధి కుక్కలు చిన్నారులపై విరుచుకుపడుతుండటంతో చిన్నారుల తల్లిదండ్రులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలకు సైకిళ్లపై వెళ్తున్నా, నడుచుకుంటూ వెళ్తున్నా కుక్కల గుంపులుగా దాడులుచేస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఒంటరిగా పిల్లలను బయటకు పంపేందుకు తల్లిదండ్రులు జంకుతున్నారు. మహిళలు, వృద్ధులు కూడా ఒంటరిగా వెళ్లాలంటే జంకాల్సి వస్తున్నది. రాత్రి సమయాల్లో అయితే కుక్కలు పాదచారులనే కాదు ద్విచక్రవాహనాలపై వెళ్తున్న వారిని కూడా తరుముతున్నాయి. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

పట్టించుకోని అధికారులు

జిల్లాలోని సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, జోగిపేట, నారాయణఖేడ్, అమీన్‌పూర్, తెల్లాపూర్, బొల్లారం మున్సిపాలిటీలతో పాటు గ్రామాల్లో అధికారులు నిద్రావస్థలో ఉన్నారు. గ్రామ సింహాలు రెచ్చిపోయి జనంపై దాడులు చేస్తున్నా నివారణ చర్యలు చేపట్టడంలో సంబంధిత శాఖల అధికారులు విఫలమయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకేరోజు ఇద్దరు చిన్నారులపై దాడి ఘటనలను చోటుచేసుకున్నా చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు.

స్టెరిలైజేషన్ చేస్తున్నాం



జిల్లాలోని అన్ని గ్రామాల్లో కుక్కల బెడద ఉందని ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో అన్ని గ్రామాల్లో స్టెరిలైజేషన్ చేశాం. మరికొన్ని గ్రామాల్లోనూ ఈ కార్యక్రమం కొనసాగుతున్నది. వెటర్నరీ అధికారులతో కలిసి స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నాం.

-సాయిబాబా, జిల్లా పంచాయతీ అధికారి

వారం రోజులు స్పెషల్‌డ్రైవ్‌లు



సంగారెడ్డి పట్టణంలో వీధి కుక్కల నియంత్రణకు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నాం. పట్టణంలో మాంసం వ్యర్థాలను పారవేయకుండా మాంసం దుకాణాల యజమానులకు హెచ్చరికలు జారీచేశాం. ఎవరైనా చెత్త కుండీల్లో మాంసం వ్యర్థాలను పారబోస్తే కఠినంగా శిక్షిస్తాం.

-సురేష్‌పవార్, సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్



వామ్మో.. 44 హైవే..

- ఆరు నెలల్లో 52 ప్రమాదాల్లో 25 మంది మృత్యువాత
- చిన్నశివనూర్ వద్ద ప్రమాదమే పెద్దది

తూప్రాన్, జూన్ 29: మెదక్ జిల్లా గుండా వెళ్తున్న 44వ నంబర్ జాతీయ రహదారి ఎక్కాలంటేనే వాహనదారులు యపడుతున్నారు. ఈ రోడ్డుపై రోజుకోచోట చిన్నా పెద్దా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని రూ. కోట్లు ఖర్చు చేస్తున్నామని చెబుతున్నా ప్రమాదాలు తగ్గడం లేదు. మెదక్ జిల్లాలో రామాయంపేట మండలం దామరచెరువు నుంచి మనోహరాబాద్ మండలం కాళ్లకల్ వరకు 60 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. మెదక్ జిల్లాలో ఈ రహదారిపై 7 బ్లాక్ స్పాట్లు గుర్తించి, అండర్‌పాస్‌లు నిర్మించేందుకు రూ. 98.18 కోట్లు మంజూరు చేశారు. భారత జాతీయ రహదారుల సంస్థ నిధులు మంజూరు చేసి టెండర్ నిర్వహించడంతో 2022 నుంచి పనులు జరుగుతున్నాయి. 44వ జాతీయ రహదారిపై ఈ సంవత్సరం ఇప్పటివరకు ఆరు నెలల్లో 52 ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. 25 మంది ప్రాణాలు కోల్పోగా.. 62 మంది గాయపడ్డారు. ఇందులో రామాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 9 ప్రమాదాలు జరిగాయి. ఇద్దరు మృతిచెందగా.. 8 మంది గాయపడ్డారు. నార్సింగి పోలీసుస్టేషన్ పరిధిలో 9 ప్రమాదాల్లో ఒకరు మృతిచెందగా, 16 గాయపడ్డారు. చేగుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో 13 ప్రమాదాల్లో 12 మంది మృతిచెందగా 13 మంది గాయపడ్డారు. తూప్రాన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 10 ప్రమాదాల్లో నలుగురు ప్రాణాలు కోల్పోగా.. 16 మంది గాయపడ్డారు. మనోహరాబాద్ స్టేషన్ పరిధిలో 11 ప్రమాదాలు జరిగాయి. నలుగురు మృతి చెందగా.. తొమ్మిది మంది గాయపడ్డారు.

ఈ సంవత్సరంలోనే ఘోర ప్రమాదం

మెదక్ జిల్లా చేగుంట మండలం చిన్నశివునూర్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదం ఇప్పటి వరకు జరిగిన ప్రమాదాల్లో భారీ ప్రమాదంగా చెప్పొచ్చు. 1997లో చేగుంట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో 32 మంది మృతిచెందడం హైవే ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేసింది. అనంతరం శుక్రవారం జరిగిన ప్రమాదంలోనే అత్యధికంగా ఆరుగురు మృత్యువాతపడగా.. నలుగురు గాయపడ్డారు. మెదక్ జిల్లాలో జరిగిన భారీ ప్రమాదంగా అధికారులు పేర్కొంటున్నారు.



రోడ్డు ప్రమాదంలో మరొకరి మృతి

- ఆరుకు చేరిన మృతుల సంఖ్య



చేగుంట, జూన్ 29: చేగుంట మండలంలో 44వ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన ప్రమాదంలో గాయపడిన మరొకరు మృతిచెందారు. దీంతో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. జాతీయ రహదారిపై రెండు లారీలు ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు మృతిచెందిన విషయం తెలిసిందే. గాయపడిన నలుగురిని చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రమేష్ అలియాస్ రాజేష్ (45) శనివారం మృతిచెందారు.

మెదక్ మున్సిపల్ సమావేశం రసాభాస

- అధికారులపై వైస్ చైర్మన్ ఆగ్రహం


చైర్మన్, వైస్ చైర్మన్ మధ్య వాగ్వాదం

మెదక్, జూన్ 29 : మెదక్ మున్సిపల్ సమావేశం రసాభాసగా మారింది. మెదక్ మున్సిపాలిటీలో సీన్ మారింది. ఒకప్పుడు చైర్మన్‌తో పాటు సభ్యులంతా అధికార పక్షమే. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో చైర్మన్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు ఆ పార్టీలో చేరిపోయారు. దీంతో బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న వైస్ చైర్మన్ మల్లిఖార్జున్‌గౌడ్, కొందరు కౌన్సిలర్లు ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నారు. చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్ అధ్యక్షతన శనివారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని, సరిపడా వర్కర్లు ఉన్నా ఈ దుస్థితి నెలకొందని వైస్ చైర్మన్ మల్లిఖార్జున్‌గౌడ్ మండిపడ్డారు. 50 మంది పారిశుధ్య కార్మికులకు ఏ పనులు కేటాయిస్తున్నారని ప్రశ్నించారు. తాను సమస్యలను ఏకరువు పెడుతున్నా అధికారులు సరైన సమాధానం ఇవ్వడం లేదని ఆగ్రహంతో వైస్ చైర్మన్ స్థానం నుంచి లేచి సాధారణ సభ్యుల స్థానంలో మల్లిఖార్జున్ కూర్చున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదంతో సభలో గందరగోళంగా మారింది. చైర్మన్ చంద్రపాల్ జోక్యం చేసుకోవడంతో తిరిగి ఆశీనులయ్యారు. మళ్లీ నిర్వహించే సమావేశానికల్లా శానిటేషన్, హరితహారం సిబ్బంది వివరాలు తనకు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గతంలో పట్టణ ప్రగతి పథకం కింద ప్రతీ వార్డుకు రూ. 10 లక్షల చొప్పున అంచనాలతో పనులు కేటాయించారని, టెండర్లు పూర్తయినా ఎందుకు నిర్మాణాలు చేపట్టడం లేదని కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు ప్రశ్నించారు. దీనిపై చైర్మన్ స్పందిస్తూ ఇప్పటి వరకు చేసిన రూ. 1.70 కోట్ల పనులకు బిల్లులు చెల్లించడానికే నిధులు లేవని, అందుకే కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ముందుకు రావడం లేదని సమాధానమిచ్చారు. అనంతరం పలువురు కౌన్సిలర్లు తమ వార్డుల్లో సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు.

రైతు హత్య కేసులో నలుగురి అరెస్ట్

గట్టు పంచాయితీనే కారణం : వెల్లడించిన పోలీసులు

రామాయంపేట, జూన్ 29 : మెదక్ జిల్లా రామాయంపేట మండలం లక్ష్మాపూర్‌లో రైతు అశోక్ దారుణ హత్య కేసులో పోలీసులు ఒకే కుటుంబంలోని నలుగురిని అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ వెంకటరాజాగౌడ్, ఎస్సై రంజిత్ శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. హతుడు అశోక్ పొలం చేవూరి రమేష్ పొలం పక్కపక్కనే ఉంటాయి. ఎనిమిదేళ్లుగా ఇరు కుంటుంబాల మధ్య పొలంగట్టు, నడిచే దారి కోసం గొడవలు జరుగుతున్నాయి. పెద్దమనుషుల పంచాయితీలు పెట్టినా ఫలితం లేకపోయింది. అశోక్ చిన్న విషయాలకు కూడా గొడవపడుతుండేవాడు. ఈ క్రమంలో అశోక్ ఆగడాలు భరించలేక ఎలాగైనా అతడిని మట్టుబెట్టాలని రమేష్ కుటుంబం నిశ్చయించుకుంది. గురువారం ఉదయం అశోక్ పొలం వద్ద పౌల్ట్రీఫాంలో ఉన్నట్టు గమనించి రమేష్ భార్య వెంకటలక్ష్మి గొడవపడింది. వెంటనే భర్త రమేష్‌తో పాటు కొడుకులు భరత్‌తేజ, వినయ్‌తేజ అశోక్‌ను వారి పొలం వద్దకు లాక్కొచ్చారు. ముందే సిద్ధంగా ఉంచిన గొడ్డలి, కర్రలతో విచక్షణారహితంగా దాడిచేశారు. అంతటితో ఆగకుండా బండరాయిని తలపై పడేశారు. అశోక్ మృతిచెందాడని నిర్ధారించుకున్న తరువాత అక్కడి నుంచి పారిపోయారు. నిందితుల కోసం గాలిస్తుండగా నమ్మదగిన సమాచారం మేరకు శనివారం రామాయంపేట హైవే పక్కన ఉన్న హోటల్ వద్ద నలుగురిని పట్టుకున్నట్లు వివరించారు. ఈ మేరకు హత్యాకేసు నమోదుచేసి రిమాండుకు తరలించినట్లు పేర్కొన్నారు.

జూలై 1 నుంచి ఆపరేషన్ ముస్కాన్

నెల రోజులు స్పెషల్ డ్రైవ్ : మెదక్ ఎస్పీ బాలస్వామి


సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ ఎస్పీ బాలస్వామి

మెదక్ అర్బన్, జూన్ 29: ఆపరేషన్ ముస్కాన్ పదో విడత కార్యక్రమం జూలై 1 నుంచి 31 వరకు నిర్వహించనున్నట్టు మెదక్ ఎస్పీ బాలస్వామి పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా జిల్లాలోని 18 ఏళ్ల లోపు తప్పిపోయిన, వదిలేసిన, కార్మికులుగా ఉన్న బాలబాలికలను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించాలన్నారు. బాలలతో బలవంతంగా భిక్షాటన చేయించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ప్రత్యేకంగా జిల్లాలోని రెండు సబ్ డివిజన్లలో ప్రత్యేంగా ఆపరేషన్ ముస్కాన్ బృందాలను నియమించామని తెలిపారు. ప్రజలు తప్పిపోయిన బాల బాలికలు, బాలకార్మికుల గురించి సమాచారం తెలిస్తే 100, 1098, 112 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, డీఈవో రాధాకిషన్, మెదక్, తూప్రాన్ ఆర్డీవోలు రమాదేవి, జయచంద్రారెడ్డి, వివిధ శాఖల అధికారులు, సత్యేంద్రప్రసాద్ రాజు, కరుణశీల, శ్రీనివాస్‌రావు, శంకర్‌గౌడ్, డా.నవీన్‌కుమార్, వెంకట్‌రామ్‌రెడ్డి, బాలనర్సింహులు, విఠల్, శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గణాంక పితామహుడు ప్రశాంత చంద్ర మహలనోబిస్ : కలెక్టర్



మహలనోబిస్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, జూన్ 29: గణాంకాల పితామహుడు ప్రొఫెసర్ ప్రశాంతచంద్ర మహలనోబిస్ అని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ కొనియాడారు. శనివారం జాతీయ గణాంక దినోత్సవాన్ని పురస్కరించుకొని మహలనోబిస్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గణాంకాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జీఎస్‌డీపీని కూడా మండల, డివిజనల్ స్థాయి, జిల్లాస్థాయిలో చేయాలని మండల ప్లానింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


ఆరోగ్య పరిరక్షణకు వీక్లీ పరేడ్ దోహదం

సంగారెడ్డి ఎస్పీ రూపేశ్


సంగారెడ్డిలో వీక్లీ పరేడ్ చేస్తున్న పోలీసులు

సంగారెడ్డి క్రైం, జూన్ 29 : పోలీసుల వీక్లీ పరేడ్ శనివారం సంగారెడ్డిలోని పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో ఆర్మ్‌డ్ రిజర్వు డీఎస్పీ నరేందర్ ఆధ్వర్యంలో ఆర్ఐలు రాజశేఖర్‌రెడ్డి, హన్మిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆర్మ్‌డ్ పోలీసులు, ట్రాఫిక్ సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరేడ్‌లో ఫిజికల్ ఫిట్‌నెస్‌తో పాటు డ్రిల్స్ ప్రాక్టీస్, రోజువారీ విధుల్లో మెళకువలు నేర్పిస్తామన్నారు.






వీడియో కాన్ఫరెన్స్‌లో సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి, అధికారులు


వీడియో కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, అధికారులు

ధరణి సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి: నవీన్ మిట్టల్

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్/సిద్దిపేట అగ్రికల్చర్, జూన్ 29: ధరణి సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లతో ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతిరోజు వెయ్యికి తగ్గకుండా పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. ఆయా జిల్లాల్లో నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి, మెదక్ అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు, సిద్దిపేట అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ ఆర్డీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

హోటల్‌లో తనిఖీ, సబ్సిడీ గ్యాస్ స్వాధీనం

● సివిల్ సప్లయ్ అధికారి ప్రణీత్‌రెడ్డి

శివ్వంపేట, జూన్ 29: సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు పక్కదారి పడుతున్నాయని 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. మండల పరిధి దొంతి గ్రామంలోని ఓ హోటల్‌ను డిప్యూటీ డీఎస్‌వో ప్రవీణ్‌రెడ్డి, ఆర్ఐ కిషన్‌తో కలిసి శనివారం తనిఖీ చేసి.. గ్యాస్ సిలిండర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని యాజమాన్యాలను హెచ్చరించారు. ఈ సందర్భంగా డీఎస్‌వో మాట్లాడుతూ సబ్సిడీ ద్వారా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సిలిండర్లు వ్యాపార వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.


దొంతి హోటల్‌ను తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎస్‌వో ప్రణీత్‌రెడ్డి







కోర్టు కోసం భవనాల పరిశీలన


ఆర్డీవోతో మాట్లాడుతున్న లక్ష్మీశారద

తూప్రాన్, జూన్ 29: తూప్రాన్ పట్టణానికి మంజూరైన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుకు సంబంధించిన భవనాలను మెదక్ జిల్లా ప్రధాన న్యాయాధికారి లక్ష్మీశారద శనివారం పరిశీలించారు. పట్టణానికి సాయంత్రం 6 గంటలకు విచ్చేసిన న్యాయమూర్తి రాత్రి 7.30 గంటల వరకు తూప్రాన్‌లోని పుట్టకోటలో ఉన్న బీసీ, ఎస్సీ హాస్టల్ భవనాలను పరిశీలించారు. భవనానికి మరమ్మతులు అధికంగా ఉండడంతో నర్సాపూర్ చౌరస్తాలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ భవనం, టోల్‌ప్లాజా వద్దగల రోడ్లు భవనాలశాఖ అతిథి గృహం, తూప్రాన్ ఆర్డీవో కార్యాలయ భవనాలను పరిశీలించారు. పుట్టకోటలోని హాస్టల్ భవనాలు అనుకూలంగా ఉన్నా.. మరమ్మతుల ఖర్చులు అధికంగా అవుతాయని ఇంజనీరింగ్ అధికారులు సూచించారు. వారి వెంట తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, డీఎస్పీ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మామిండ్ల జ్యోతికృష్ణ, సీఐ రంగ కృష్ణ, ఎస్ఐ శివానందం, రోడ్లు భవనాలశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సర్దార్‌సింగ్, కమిషనర్ ఖాజామొహిజుద్దీన్, న్యాయవాదులు పాల్గొన్నారు. పోతరాజుపల్లిలోని వెల్దుర్తి మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఆత్మహత్యాయత్నం చేసిన విద్యార్థి కుటుంబాన్ని పరామర్శించారు. చిన్నశివునూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మధ్యప్రదేశ్‌కు చెందిన ఆరుగురు మృతిచెందిన విషయం తెలిసిందే. కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశాల మేరకు ఆర్డీవో జయచంద్రారెడ్డి బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ పురస్కారానికి చేనేత కార్మికుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి టౌన్, జూన్ 29: ఆగస్టు 7న చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం చేనేత కళాకారుల కళా నైపుణ్యాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర స్థాయిలో కొండా లక్ష్మణ్ బాపూజీ పురస్కారం అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని చేనేత, జౌళిశాఖ జిల్లా సంచాలకులు విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డులు చేనేత కళాకారులు, చేనేత డిజైనర్లకు వృత్తిలో నైపుణ్యం, ప్రత్యేకతల ఆధారంగా అందిస్తామని చెప్పారు. అవార్డు గ్రహీతలకు రూ.25వేల నగదు, చేనేత శాలువా, జ్ఞాపిక అందించి మెరిట్ సర్టిఫికెట్‌తో సత్కరిస్తామని వివరించారు. 2023 డిసెంబరు నాటికి 25 ఏళ్లు పైబడి ఐదేళ్ల అనుభవం తగ్గకుండా ఉండాలన్నారు. ఆసక్తి గల వారు జూలై 10వ తేదీలోగా సంచాలకులు, చేనేత జౌళిశాఖ సంగారెడ్డి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. జూలై 15వ తేదీలోగా దరఖాస్తుదారుని ఉత్పత్తిని, మగ్గంపై తనిఖీ చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురి అరెస్ట్

● 330 గ్రాముల గంజాయి, రెండు బైక్‌లు, రెండు మొబైల్ ఫోన్ స్వాధీనం


నిందితుల వివరాలను తెలుపుతున్న గజ్వేల్ సీఐ సైదా

గజ్వేల్, జూన్ 29: గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ పట్టణానికి చెందిన టంగుటూరి శివానంద్(22), హైదరాబాద్‌కు చెందిన జుమ్మేరాత్ బజార్, దూల్‌పేటకు చెందిన కుల్దీప్‌సింగ్(20), అనిత భాయ్(45)లు ముఠాగా ఏర్పడ్డారు. గజ్వేల్‌లోని పిడిచేడ్ రోడ్డులో శివాజీ విగ్రహం సమీపంలో టంగుటూరి శివానంద్ గంజాయి అమ్మడానికి ప్రయత్నిస్తున్నాడని సమాచారం రాగా సీఐ సైదా, అదనపు ఇన్‌స్పెక్టర్ ముత్యంరాజు, సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బందితో వెళ్లి శివానంద్ వద్ద 120 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎవరి దగ్గరి నుంచి తీసుకొచ్చావని విచారించగా.. కుల్దీప్‌సింగ్, అనిత్‌బాయ్ పేర్లు తెలిపాడు. వర్గల్ మండలం గౌరారం బస్టాండ్ సమీపంలో చాకచక్యంగా పట్టుకున్నారు. వారినుంచి 210 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురిని రిమాండ్‌కు పంపించారు.

డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్తలకు అవార్డులు, ప్రశంసాపత్రాలు

జహీరాబాద్, జూన్ 29: 2023 సంవత్సరానికిగాను జహీరాబాద్ మండలంలోని అల్గోల్ గ్రామ శివారులో గల డీడీఎస్-కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డా. వరప్రసాద్, డీడీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దివ్యకు అవార్డులు, ప్రశంసాపత్రాలను ఇటీవల అందజేశారని కేవీకే శాస్త్రవేత్తలు, అవార్డు గ్రహీతలు శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఇటీవల రాజమండ్రిలోని జాతీయ పొగాకు పరిశోధనాస్థానంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 72 కేవీకేలకు చెందిన ప్రతినిధులు, పరిశోధనా సంస్థల డైరెక్టర్లతో సమావేశం జరిగిందన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని అల్గోల్ గ్రామ శివారులోని కేవీకే శాస్త్రవేత్తలు 2023లో 2,518 భూసార పరీక్షలు చేసి రైతులకు ఇచ్చినందుకు అవార్డులు, ప్రశంసాపత్రాలను అందజేశారన్నారు.

కౌలు రైతులకూ న్యాయం చేయాలి



కంది పీఏసీఎస్‌లో ప్రజాభిప్రాయ సేకరణలో అధికారులతో మాట్లాడుతున్న రైతులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టిన రైతు భరోసా పథకం అమలుకు సంబంధించి శనివారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని పలు మండలాల్లో రైతుల నుంచి అభిప్రాయసేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా రైతుభరోసా సాయాన్ని మరింత పెంచాల్సిన అవసరముందని, పట్టాదారుకు భరోసా ఇస్తూనే కౌలు రైతులకు సైతం న్యాయం చేయాలని రైతులు అభిప్రాయపడ్డారు.

కంది, జూన్ 29: మండలకేంద్రమైన కందిలోని పీఏసీఎస్‌లో ప్రత్యేక సర్వసభ్య సమావేశంతో పాటు శనివారం రైతుభరోసాపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిచారు. ఈ కార్యక్రమానికి డీసీవో తుమ్మ ప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ దొడ్ల ప్రభాకర్ రెడ్డి, రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఐదెకరాలకు పైగా ఉన్న రైతులకు కూడా రైతుభరోసా ఇవ్వాలని రైతుల డిమాండ్ చేశారు. ఎకరాకు ప్రభుత్వం ఇచ్చే రూ.15వేలు చాలదని, దాన్ని మరికాస్త పెంచాలని మరి కొందరు రైతులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమానికి వ్యవసాయ శాఖ అధికారులు గైర్హాజరు కావడం చర్చనీయంశంగా మారింది. కార్యక్రమంలో డీసీసీబీ అధికారి ఇందిరా, పీఏసీఎస్ సీఈవో మందాడ శ్రీధర్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు కొత్తగడి బుచ్చయ్య, అంతయ్య, రైతులు మోహన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **మునిపల్లి:** మండలంలోని పెద్దచెల్మెడ రైతు వేదికలో సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు భరోసా పథకంపై అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమ అభిప్రాయాలను తెలియజేశారు. జిల్లా సహకార బ్యాంకు అధికారి తుమ్మ ప్రసాద్ రైతుల నుంచి స్వీకరించిన అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కవిత, జూనియర్ అసిస్టెంట్ రాథోడ్ సందీప్, ఏవో శివకుమార్, సొసైటీ చైర్మన్ పద్మ దుర్గయ్య, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.



మునిపల్లి: పెద్దచెల్మెడలో రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా సహకార బ్యాంకు అధికారి

● **ఝరాసంగం:** మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంలో శనివారం రైతుభరోసా పథకంపై రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టారు. మండల సొసైటీ చైర్మన్ గౌసొద్దీన్ ఆధ్వర్యంలో అధికారులు కార్యక్రమాన్ని నిర్వహించగా, రైతులు తమ అభిప్రాయాలను అధికారులకు తెలియజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ జిల్లా అధికారులు ఓఎస్‌డీ శ్రీధర్, సబ్‌డివిజన్ కోఆపరేటీవ్ అధికారి శ్రీనివాస్, ఏవో వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

● **పెద్దశంకరంపేట:** మండలకేంద్రంలోని రైతు వేదికలో పేట ప్రాథమిక వ్యవసాయసహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఆయా గ్రామాల రైతులతో రైతు భరోసా పై అభిప్రాయ సేకరణ చేపట్టారు. రైతుల అభిప్రాయాలన్నింటిని సహకారసంఘం వారు జిల్లా వ్యవసాయ కార్యాలయం, జిల్లా కోఆపరేటీవ్ కార్యాలయానికి పంపనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సిద్ద సంజీవరెడ్డి, ఏవో యాదగిరి, ఏఈవో సుభాష్, పీఏసీఎస్‌సీఈవో రవీందర్, పాలకవర్గ సభ్యులు రైతులు పాల్గొన్నారు.

● **కొల్చారం:** మండలంలోని రంగంపేట సొసైటీ ఆవరణలో డీసీఎంఎస్ వైస్‌చైర్మన్, సొసైటీ చైర్మన్ అరిగె రమేష్‌కుమార్ అధ్యక్షతన శనివారం రైతుభరోసాపై అధికారులు రైతుల అభిప్రాయ సేకరణ జరిపారు. ఈ కార్యక్రమానికి సహకార శాఖ జిల్లా ఆడిటర్ కరుణాకర్‌చారి ప్రత్యేక అధికారిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సొసైటీ పరిధిలోని ఎనిమిది గ్రామాల రైతులు తమ తమ అభిప్రాయాలను అధికారులకు తెలుపగా, అధికారులు నమోదు చేశారు. కాగా పంటలు సాగు చేసిన రైతులందరికీ పరిమితి లేకుండా ప్రతి ఎకరాకు రైతు భరోసా ఇవ్వాలని, బీడు, గుట్ట భూములకు రైతుభరోసా ఇవ్వకుండా నిధుల దుర్వినియోగాన్ని అరికట్టాలని రైతులు అభిప్రాయపడ్డారు. రైతులు సాగు చేస్తున్నపట్టాదారులకు రైతుభరోసా ఇస్తూనే కౌలు రైతులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో రంగంపేట క్లస్టర్ వ్యవసాయ విస్తీర్ణ అధికారి నిరోషా, సొసైటీ సీఈవో నవీన్, డైరెక్టర్లు, రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.



కొల్చారం: రంగంపేట సొసైటీలో మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ అరిగె రమేష్‌కుమార్

● **పాపన్నపేట:** భూపరిమితి విధించకుండా రైతులందరికి రైతు భరోసా ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. శనివారం పాపన్నపేట మండలం చీకోడ్ సొసైటీ పరిధి గ్రామాల రైతులతో రైతు భరోసా పథకంపై అభిప్రాయ సేకరణ నిర్వహించారు. సమావేశానికి జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ ముఖ్యతిథిగా పాల్గొనగా సొసైటీ చైర్మన్ దత్తరాజు అధ్యక్షతన ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఈ సందర్భంగా కౌలు రైతులకు రైతు భరోసా పథకం ఇవ్వాలని రైతులకు ఎలాంటి షరతులు విధించకుండా న్యాయం చేయాలన్నారు. 10 ఎకరాల వరకు పరిమితి విధించి పెట్టుబడి సాయం అందించాలని రైతులు అధికారుల ముందు వెల్లడించారు. కార్యక్రమంలో సహకార శాఖ క్లస్టర్ ఇన్‌చార్జి ఫైజొద్దిన్, మండల వ్యవసాయ అధికారి నాగం కృష్ణ, ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

● **రేగోడు:** రేగోడు వ్యవసాయ సహకార సంఘం వద్ద రైతు భరోసా పథకంపై అభిప్రాయ సేకరణ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి గోవింద హాజరై రైతుల సలహాలను, అభిప్రాయాలను తీసుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాజు యాదవ్, వైస్‌చైర్మన్ రాధాకిషన్, డైరెక్టర్ రాములు, సంగయ్య, పీఏసీఎస్ సీఈవో ఆఫీజొద్దిన్, ఏవో జావిద్, ఏఈవోలు సునీల్ కుమార్, వినీత్ కుమార్ ఉన్నారు.



పెద్దశంకరంపేటలో ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి గోవింద్

మీడియాకు సమాచారం ఇవ్వకుండానే...

కోహీర్ జూన్ 29: రైతుభరోసా అమలుకు సంబంధించి అభిప్రాయాల సేకరణ ప్రత్యేక గ్రామసభ వివరాలను ఆయా సహకార సంఘాల సభ్యులకు, మీడియాకు సంబంధితశాఖ అధికారులు ముందస్తుగా సమాచారం అందజేయాలి. అయితే కోహీర్ మండలంలోని మాచిరెడ్డిపల్లి సొసైటీలో శనివారం ఏర్పాటు చేసిన సహకార సంఘాల సభ్యుల అభిప్రాయ సేకరణ ప్రత్యేక మహాజన సభ విషయాన్ని సంబంధితశాఖ అధికారులు మీడియాకు సమాచారం ఇవ్వకుండా నిర్వహించారు. ప్రజలకు ప్రభుత్వానికి వారిదిగా ఉండే మీడియాకు సమాచారం ఇవ్వకుండా అభిప్రాయాల సేకరణ సభ నిర్వహించడం పట్ల పలువురు రైతులు అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమలు చేసే ఏ సంక్షేమ పథకమైన మీడియా ద్వారా తెలియజేస్తేనే అర్హులకు ప్రయోజనం చేకూరి ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని పలువురు రైతులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, అధికారులు శ్రీధర్ శ్రీనివాసరావు, నవీన్, బిక్షపతి, నవీన్‌కుమార్, శ్రీకాంత్ రైతన్న తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి



శ్రీనివాస్(ఫైల్)

మనోహరాబాద్, జూన్ 29: ఇంట్లో విద్యుత్ షాక్ తగిలి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని గౌతోజీగూడెంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గౌతోజీగూడెం గ్రామానికి చెందిన పూల శ్రీనివాస్ (55) ఇంట్లోని సంపులో నీటిని తొలగించేందుకు విద్యుత్ మోటార్‌ను ఏర్పాటు చేశాడు. అది పని చేయకపోవడంతో విద్యుత్‌వైర్లను తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. కుటుంబీకులు హుటాహుటిన తూప్రాన్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కళ్ల ముందే భర్త మరణించడంతో భార్య నాగమణి రోదన చూపరులను కంట తడిపెట్టించింది.

దంపతుల మధ్య గొడవ.. భార్య ఆత్మహత్య



మౌనిక మృతదేహం

గుమ్మడిదల, జూన్ 29: దంపతుల మధ్య గొడవ జరగడంతో మనస్తాపం చెందిన భార్య ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన శనివారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి గ్రామానికి చెందిన మౌనిక (26) అనే మహిళ ఉదయం తన భర్తతో చిన్న గొడవ పడినట్లు తెలిపారు. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతురాలి తండ్రి భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

అల్వాల్, జూన్ 29: హైదరాబాద్‌లోని కానాజిగూడలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మెదక్ జిల్లాకు చెందిన ఓ యువకుడు మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మెదక్ జిల్లాకు చెందిన సతీష్‌రెడ్డి(25) హైదరాబాద్ బోయిన్‌పల్లిలోని ఓ సిమెంట్ దుకాణంలో పనిచేస్తూ ఉపాధి పొందుతున్నాడు. శనివారం మధ్యాహ్నం సతీష్‌రెడ్డి లంచ్‌కు వెంకట్రావ్‌పేటలోని తన ఇంటికి వచ్చి తిరిగి బైక్‌పై షాప్‌కు బయలుదేరాడు. కానాజిగూడ చౌరస్తా సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో బైక్ అదుపు తప్పి కిందపడిపోయింది. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొనడంతో సతీష్‌రెడ్డి అక్కడికక్కడనే మృతి చెందాడు. ఈ మేరకు అల్వాల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుమ్మడిదలలో గుర్తుతెలియని శవం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

గుమ్మడిదల, జూన్ 29: మండల కేంద్రంలో ఓ గుర్తుతెలియని శవం లభ్యమైనట్లు ఎస్‌ఐ మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. వివరాల్లోకి వెళ్తే.. శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ఒక గుర్తు తెలియని సుమారు 35 ఏళ్ల లోపు మగ వ్యక్తి చనిపోయినట్లు స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా కుడి చేతిపై త్రిశూలం ఆకారంలో పచ్చబొట్టు ఉన్నట్లు తెలిపారు. చనిపోయిన వ్యక్తి గురించి తెలిసినవారుంటే జిన్నారం సర్కిల్ పోలీస్ స్టేషన్, గుమ్మడిదల పోలీస్ స్టేషన్ 8712656730, 8712656157 ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

గురుకులంలో ఇష్టంలేక విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

తూప్రాన్, జూన్ 29: మహాత్మా జ్యోతిబాపూలే విద్యాలయంలో చేరిన ఓ బాలిక.. గురుకులంలో ఉండి చదువుకోవడం ఇష్టం లేక ఆత్మహత్యాయత్నం చేసింది. దురద మందు తాగిన ఆమె ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. మెదక్ జిల్లా తుప్రాన్‌లోని నిర్వహిస్తున్న వెల్దుర్తి మహాత్మా జ్యోతిబా పూలే గురుకులంలో శనివారం ఈ ఘటన చోటు చేసుకున్నది. ఝరాసంఘం మండలం గిన్నాయపల్లి గ్రామానికి చెందిన 12 ఏళ్ల బాలిక 7వతరగతి చదివేందుకు తూప్రాన్ పట్టణ పరిధి పోతరాజుపల్లిలో నిర్వహిస్తున్న వెల్దుర్తిలోని జ్యోతిబా పూలే గురుకులంలో చేర్పించారు. గత సోమవారం గరుకులంలో చేర్పించగా, తాను గురుకులంలో ఉండనని, ఇంటికి వస్తానంటూ మారం చేయడంతో గురువారం తల్లిదండ్రులు వచ్చి నచ్చజెప్పారు. శుక్రవారం రాత్రంతా బాలిక ఏడుస్తూ ఉన్నట్లు గురుకుల సిబ్బంది చెప్పారు. శనివారం ఉదయం దురద మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. వెంటనే గుర్తించిన గురుకులం సిబ్బంది తూప్రాన్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతుంది.

మలేరియా, డెంగీ నివారణకు చర్యలు తీసుకోవాలి

టేక్మాల్, జూన్ 29: వర్షాకాలం నేపథ్యంలో మండలంలో మలేరియా డెంగీ వ్యాధుల నివారణకు వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో శ్రీరాం సూచించారు. శనివారం టేక్మాల్ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్యాధికారులు, పల్లె దవాఖాన ఎంఎల్‌హెచ్‌పీలు, సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలకు సీజనల్ వ్యాధులపై సమావేశం నిర్వహించారు. మలేరియా, డెంగీ వ్యాధులకు అందించే చికిత్సపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి పవన్‌కుమార్ సిబ్బంది ఉన్నారు.

అక్రమ కేసులతో ప్రతిపక్షాలపై కక్ష సాధింపు

● **ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్**

హత్నూర, జూన్ 29: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్షాలపై అక్రమ కేసులు బనాయిస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని బీజేపీ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్ సమీపంలో గల బీ.ఎస్.రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆప్ జిల్లా కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ దేశంలో రోజురోజుకూ ఆమ్ ఆద్మీ పార్టీకి వస్తున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేక కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కేజ్రీవాల్‌ను లిక్కర్ స్కామ్‌లో ఇరికించి జైల్లో పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయంగా ఎదుర్కొనే శక్తి లేక ఇలా అక్రమ కేసులు బనాయిస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు రాములుగౌడ్, సల్మాన్ రాజ్, జిల్లా అధ్యక్షుడు మిట్టపల్లి రాజేశ్వర్, మైనార్టీ కోర్ కమిటీ సభ్యులు మహమ్మద్ బాజీద్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు హేమ, ప్రధాన కార్యదర్శి యమునాగౌడ్, లచ్చానాయక్, పటాన్‌చెరు, సంగారెడ్డి నియోజకవర్గాల ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే ఊరుకోం



ఎంపీటీసీలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

చిన్నశంకరంపేట, జూన్ 29: గత ప్రభుత్వానికి కొమ్ము కాసి, విధులను నిర్లక్ష్యం చేసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేస్తే చూస్తూ ఊరుకోబోమని ఎమ్మెల్యే రోహిత్‌రావు అధికారులను హెచ్చరించారు. ఎంపీపీ కార్యాలయంలోని శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో సంబంధిత శాఖల అధికారులను అభివృద్ధి పనులపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. గ్రామాల్లోని అభివృద్ధి పనులపై ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. గత ప్రభుత్వంలో చేపట్టి మధ్యలోనే నిలిపేసిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేస్తుందన్నారు. కాగా గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేసేందుకు కృషి చేయాలని, అప్పటి సర్పంచ్‌లు అప్పులు చేసి అభివృద్ధి పనులు చేపట్టారని మాజీ సర్పంచ్ రాజిరెడ్డి ఎమ్మెల్యే రోహిత్‌రావును కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. అనంతరం పలు శాఖలకు చెందిన అధికారులు అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే రోహిత్‌రావుకు వివరించారు. అనంతరం ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ పదవీ కాలం ముగియడంతో ఎంపీపీ, ఎంపీటీసీలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, ఎంపీడీవో దామోదర్, తహసీల్దార్ మన్నన్, ఎంఈవో బుచ్చయ్య నాయక్, వైద్యాధికారి డాక్టర్ సాయిసింధు, ఏవో ప్రవీన్, పీఆర్ఏఈ విజయ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నిఖిల, ఎంపీవో కలిముల్ల, సంబంధిత శాఖల అధికారులు, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మరి కొద్ది రోజుల్లో రైతు రుణమాఫీ

మరికొద్ది రోజుల్లో రైతు రుణమాఫీకి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే రోహిత్‌రావు, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. చిన్నశంకరంపేటలో శనివారం నూతనంగా నిర్మించిన పీఏసీఎస్ భవనాన్ని సొసైటీ చైర్మన్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రోహిత్‌రావు, మెదక్ ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి ప్రారంభించారు. చిన్నశంకరంపేట సొసైటీకి నిధులను ఇచ్చి సహకరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ భాగ్యలక్ష్మి, ఏడీఏ విజయ నిర్మల, ఏజీఎం నర్సింహారెడ్డి, సొసైటీ చైర్మన్ అంజిరెడ్డి, మాజీ చైర్మన్ మేడి నాగేష్, సీఈవో రమేష్, డైరెక్టర్లు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌తో సమావేశమైన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

అదనపు కలెక్టర్‌తో సమావేశమైన ఎమ్మెల్యే

సంగారెడ్డి అర్బన్, జూన్ 29 : సంగారెడ్డి నియోజకవర్గ పరిధిలో నెలకొన్న సమస్యలు, పలు అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో సమావేశమయ్యారు. సైంటిఫిక్ సాలీడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పార్క్‌పై ప్రధానంగా చర్చించారు. పట్టణంలో నీటి సరఫరా చేయడంలో మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, తాగు నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా చేయాలని ఆయన ఆదేశించారు. కొత్త మాస్టర్‌ప్లాన్‌ను ప్రభుత్వానికి ప్రతిపాదనలు ఇవ్వాలని ఆయన కోరారు. వెజ్‌నాన్‌వెజ్ మార్కెట్ యార్డ్ నిర్మాణ పనులపై ఆరా తీశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహన్, డీఈ ఇంతియాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పోటీల్లో విజేతలు వీరే


సంగారెడ్డి అర్బన్, జూన్ 29: జిల్లాస్థాయిలో జాతీయ హరిత దళం ఆధ్వర్యంలో పాఠశాల విద్యాశాఖ నిర్వహించిన పోటీల్లో పలువురు విద్యార్థులు విజేతలుగా నిలిచారు. సంగారెడ్డిలోని జిల్లా సైన్స్ కేంద్రంలో శనివారం నిర్వహించిన పోస్టర్ మేకింగ్, పోయేట్రీ రైటింగ్ పోటీల్లో 180 మందికి పైగా విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. పోస్టర్ మేకింగ్‌లో సంగారెడ్డిలోని శాంతినగర్ హైస్కూల్ విద్యార్థిని అమీమానహస్కా ప్రథమ బహుమతి, ఫుల్‌కుర్తి కేజీబీవీకి చెందిన మేఘన రెండో బహుమతి, సదాశివపేట శాంతినికేత్ విద్యాలయానికి చెందిన కార్తీక్ మూడో బహుమతి సాధించారు. పోయెట్రీ రైటింగ్ విభాగంలో ఇంగ్లిష్ విభాగంలో తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన ప్రవలిక మొదటి బహుమతి సాధించగా, మునిపల్లి జడ్పీహెచ్ఎస్‌కు చెందిన హారిక ద్వితీయ బహుమతి సాధించింది. తెలుగు పొయెట్రీ రైటింగ్ విభాగంలో తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ హోతి-కెకు చెందిన దీక్షిత మొదటి బహుమతి, సంగారెడ్డి సెయింట్ ఆంథోనీస్ విద్యార్థిని హితారెడ్డి ద్వితీయ బహుమతి లభించింది. విజేతలను డీఈవో వెంకటేశ్వర్లు అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌జీసీ రాష్ట్ర ప్రాజెక్టు అధికారి రాజశేఖర్, డీఎస్‌వో సిద్దారెడ్డి, గైడ్ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ అభివృద్ధికి అన్ని విధాల సహకారం

● **మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్యే సునితారెడ్డి**

నర్సాపూర్, జూన్ 29: నర్సాపూర్ పట్టణ అభివృద్ధికి అన్ని విదాల సహకారం అందిస్తానని ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. శనివారం చైర్మన్ అశోక్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన మున్సిపల్ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కేటాయించిన టీయూఎఫ్ఐడీసీ, ఎస్‌డీఎఫ్ నిధులు తిరిగి విడుదల చేయించి పట్టణంలో నిలిచిపోయిన పలు అభివృద్ధి పనులు తిరిగి ప్రారంభించేలా కృషి చేస్తానన్నారు. సమావేశంలో పలు అభివృద్ధి పనులపై చర్చించి వాటిని ఆమోదించారు. కార్యక్రమంలో కమిషనర్ జైరాంనాయక్ మున్సిపల్ వైస్‌చైర్మన్ నయీం, మేనేజర్ మధుసూదన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కాజీపల్లి కాలుష్య సమస్య పరిష్కరించాలి



రాష్ట్ర సచివాలయంలో మంత్రి పొన్నంకు వినతిపత్రాన్ని అందజేస్తున్న కాజీపల్లి జేఏసీ నాయకులు

జిన్నారం, జూన్ 29: కాజీపల్లి పారిశ్రామికవాడ కాలుష్య సమస్యను పరిష్కరించాలని గ్రామ జేఏసీ నాయకులు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను జేఏసీ నాయకులు రమాకాంత్, కుమార్‌యాదవ్, సయ్యద్ రహీస్, మహేష్, మహ్మద్ హుస్సేన్, సురేష్, నాగరాజు, కిరణ్, బాలు, భరత్, వెంకట్‌లు కలిశారు. వారం రోజులుగా కాలుష్య సమస్యపై ఆయా శాఖల అధికారులకు తెలియజేశామని, పరిశ్రమల కాలుష్యంతో తీవ్రంగా నష్టపోతున్నామని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అదేవిధంగా గ్రామానికి బస్సు సౌకర్యం నిలిచిపోయిందని తెలుపగా.. వెంటనే స్పందించిన మంత్రి సికింద్రాబాద్ నుంచి కాజీపల్లికి బస్సు సర్వీసును మంజూరు చేశారని, కాలుష్య సమస్యపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

పెద్దశంకరంపేటలో 26 ద్విచక్ర వాహనాలు సీజ్

పెద్దశంకరంపేట, జూన్ 29: పెద్దశంకరంపేటలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 26 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి పెద్దశంకరంపేటలో ప్రధాన రహదారిపై స్పెషల్‌డ్రైవ్ నిర్వహించగా, సరియైన ధ్రువపత్రాలు లేకుండా, నంబర్‌ప్లేట్ లేకుండా నడుపుతున్న 26 ద్విచక్ర వాహనాలను పట్టుకొని పెద్దశంకరంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో పేట ఎస్‌ఐ శంకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకోవాలి: డీఈవో

చిన్నశంకరంపేట, జూన్ 29: విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకోవాలని డీఈవో రాధాకిషన్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని హైస్కూల్‌ను డీఈవో ఆకస్మికంగా సందర్శించి, విద్యార్థులతో ప్రార్థనలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యాబోధనతో పాటు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పాఠశాలలో పలు రికార్డులను పరిశీలించారు.

విత్తనాల విక్రయాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

నర్సాపూర్, జూన్ 28: ఎరువులు,విత్తనాలు విక్రయించే వ్యాపారులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు చట్టపరంగా తప్పవని మండల వ్యవసాయ అధికారి దీపిక పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్ పట్టణంలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో స్టాకు రిజిష్టర్లతో పాటు విత్తనాలు, ఎరువులను పరిశీలించారు.

ప్రజలు పోలీసులకు సహకరించాలి

వెల్దుర్తి, జూన్ 29: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని తూప్రాన్ సీఐ రంగాకృష్ణ అన్నారు. శనివారం వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. ఎస్‌ఐ నవతాగౌడ్ ద్వారా పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన వివరాలను సీఐ అడిగి తెలుసుకున్నారు.

మెరుగైన సేవలే ఆర్టీసీ లక్ష్యం

- **ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య**

నారాయణఖేడ్, జూన్ 29: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే ఆర్టీసీ లక్ష్యమని స్థానిక ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. శనివారం ఖేడ్‌లో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగ్‌ధర్ నుంచి రాములు చిన్నీ ఫోన్ చేసి వట్‌పల్లి, సదాశివపేట, వికారాబాద్, దర్గాషరీఫ్‌లకు, కల్హేర్ మీదుగా నిజాంసాగర్‌కు బస్సులు నడపాలని కోరారు. కడ్పల్ నుంచి హన్మంత్‌రెడ్డి, భూంరెడ్డి మాట్లాడుతూ ఖేడ్ నుంచి కడ్పల్ మీదుగా పిట్లంకు బస్సునడపాలని విజ్ఞప్తి చేశారు. న్యాల్‌కల్ నుంచి సిద్దన్న మాట్లాడుతూ న్యాల్‌కల్, డప్పూర్ మీదుగా బీదర్‌కు బస్సు నడపాలని, నవీన్‌కుమార్ మాట్లాడుతూ ఖేడ్ నుంచి ఝరాసంగం, న్యాల్‌కల్‌మీదుగా బీదర్‌కు బస్సునడపాలని కోరారు. ఆయా సమస్యలను నమోదు చేసుకున్న డీఎం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ప్రభుత్వ ఐటీఐని ఏర్పాటుచేయాలి

జహీరాబాద్, జూన్ 29: జహీరాబాద్‌లో ప్రభుత్వ ఐటీఐని ఏర్పాటు చేయాలని జహీరాబాద్ అసెంబ్లీకన్వీనర్ నౌబాద్‌జగన్, బీజేపీయువమోర్చా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ రవీందర్‌కు వినతి పత్రం అందజేశారు.

నీట్ పరీక్ష రద్దు చేయాలి

సంగారెడ్డి అర్బన్, జూన్ 29 : నీట్ పరీక్ష రద్దు చేసి, పరీక్ష నిర్వహణను రాష్ట్రాలకు అప్పగించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వై.అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని కలెక్టరేట్ ఎదుట సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ జిల్లా అధ్యక్షుడు సంజీవయ్య, ఎంజేపీ కన్వీనర్ అన్వర్, ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్‌మహేంద్ర, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలో పోలీసుల అత్యుత్సాహం

మెదక్ అర్బన్, జూన్ 29: మెదక్‌లో 15 రోజుల క్రితం జరిగిన ఘర్షణలో పోలీసుల అత్యుత్సాహమే ప్రధాన కారణమని, ఇలాంటి ఘర్షణలు చోటు చేసుకోవడం బాధాకరమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గోవధ జరగకుండా చూడాలని రాష్ట్రశాఖ పిలుపు మేరకు బీజేవైఎం నాయకులు ముందుగానే పోలీసుల అధికారులకు వినతి పత్రాలు సమర్పించారన్నారు. గోవులు ఉన్నట్లు తెలుసుకున్న బీజేవైఎం నాయకులు పోలీసులకు సమాచారం ఇచ్చినప్పటికీ సకాలంలో స్పందించలేక కాలయాపన ఎందుకు చేశారని ప్రశ్నించారు. మొదటగా గోరక్షకులపై దాడి చేసినప్పుడు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చినా కనీసం పిటిషన్ స్వీకరించే పరిస్థితిలో పోలీసులు లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఒక వర్గం తమపై రాళ్ల దాడి చేస్తుంటే, మరోవైపు పోలీసులు కూడా తమపై లాఠీచార్జి చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఈ ఘర్షణలకు పోలీసులు, స్థానిక ఎమ్మెల్యే పూర్తి బాధ్యత వహించాలన్నారు. విషయం తెలుసుకొని మాట్లాడడానికి వెళ్లిన తనపై ఏ1, ఏ 2 గా చేర్చి కేసులు నమోదు చేయడం ఎంత వరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. సీఐల తప్ప లేకుంటే ఎందుకు బదిలీ చేశారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, కారణమైనవారిని కఠినంగా శిక్షించాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్

ఉద్యోగ విరమణ సహజం



హన్మంతరెడ్డిని సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, జూన్ 29: ప్రతీ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ సహజమని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆర్ఎస్ఐగా పనిచేస్తున్న బి.హన్మంతరెడ్డికి శనివారం ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హన్మంత్‌రెడ్డి తొలుత ఏఆర్ పోలీసు కానిస్టేబుల్‌గా పనిచేశారని, అంచెలంచెలుగా పదోన్నతులు పొందుతూ ఆర్మ్‌డ్ రిజర్వు సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారని చెప్పారు. పోలీసు శాఖకు ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్లు అశోక్, వెంకటేశం, ఏఆర్ డీఎస్పీ నరేందర్, ఆర్ఐ రాజశేఖర్‌రెడ్డి, రామారావు, హన్మిరెడ్డి, హన్మంతరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సంగీతం మాస్టారుకు ఘన సన్మానం



శంకర్‌జోషిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది

సదాశివపేట, జూన్ 29 : పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సంగీతం మాస్టారుగా ఉత్తమమైన సేవలందించి పదవీ విరమణ పొందిన శంకర్‌జోషి(మ్యూజిక్ మాస్టర్)ను ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. 15ఏళ్ల పాటు ఆయన అందించిన సేవలు మరువలేనివని పలువురు కొనియాడారు.



డీఎస్‌పార్థివ దేహానికి నాయకులతో కలిసి నివాళులర్పిస్తున్న ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

డీఎస్ మృతిపట్ల పలువురి సంతాపం

నారాయణఖేడ్, జూన్ 29: మాజీ మంత్రి, మాజీపీసీసీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ ఆకస్మిక మృతిపట్ల జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఆయనతో తనకు సాన్నిహిత్యం ఉండేదని షెట్కార్ గుర్తు చేసుకున్నారు. సంజీవరెడ్డి హైదరాబాద్‌లో శ్రీనివాస్ పార్థివ దేహం వద్ద వివిధ పార్టీల నాయకులతో కలిసి నివాళులర్పించారు. రాజకీయాల్లో ఆయన చేసిన సేవలు మరువలేనివని తెలిపారు.

కేంద్ర మంత్రిని కలిసిన జన్‌వాడే సంగప్ప

నారాయణఖేడ్, జూన్ 29: కేంద్ర పర్యాటక, భారీపరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి కుమార స్వామిని శనివారం ఢిల్లీలోని ఆయన నివాసంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జన్‌వాడే.సంగప్ప మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట బీజేపీకి చెందిన ఆదిలాబాద్ ఎంపీ గోడంనగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఉన్నారు. పర్యాటకం, భారీ పరిశ్రమల విషయంలో తెలంగాణకు తగిన ప్రాధాన్యతివ్వాలని మంత్రిని కోరారు.



కేంద్రమంత్రి కుమార స్వామితో సంగప్ప

జడ్పీటీసీల సహకారంతో అభివృద్ధి

నారాయణఖేడ్, జూన్ 29: జడ్పీటీసీల సహకారంతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆమె ఖేడ్‌ను సందర్శించారు. స్థానిక జడ్పీటీసీ లక్ష్మిబాయిరవీందర్‌నాయక్ స్వగృహంలో తేనీటివిందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ ఆమెను శాలువాతో సన్మానించారు. అనంతరం జర్నలిస్టు కాలనీలో మొక్కలు నాటి నీళ్లు పోశారు.

తైబజార్ వేలం రెండోసారి వాయిదా

శివ్వంపేట, జూన్ 29: తైబజార్ వేలంలో సరైన ధర రాకపోవడంతో శివ్వంపేట తైబజార్ వేలం శనివారం రెండోసారి వాయిదా వేసినట్లు కార్యదర్శి రమాదేవి తెలిపారు. మండల కేంద్రమైన శివ్వంపేట వేలంను శనివారం రెండోసారి నిర్వహించారు. కాగా రెండవ సారి కూడా సరైన ధరకు వేలం కానందున అధికారుల ఆదేశాల మేరకు జూలై 2న వేలం వేయనున్నట్లు కార్యదర్శి రమాదేవి తెలిపారు.